ముమ్మరంగా పోల్ చిట్టీల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్న బీఎల్ఓలు
- మే 2 నాటికే పూర్తి చేసేలా చర్యలు
- ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన



పెద్దవూరలో పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సరోజ



మిర్యాలగూడ టౌన్ : బాపూజీనగర్‌లో పోల్ చిట్టీలను పంపిణీ చేస్తున్న బీఎల్ఓ

మిర్యాలగూడ టౌన్, పెద్దవూర : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. వీనిలో భాగంగా పోల్ చిట్టీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పోల్ చీటీలు అందజేస్తున్నారు. ఈ ప్రక్రియ శుక్రవారం నుంచి మండలంలో ప్రారంభమైంది.

కేంద్రాల సమాచారం తెలిసేలా..

ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోల్ చిట్టీలు ఎంతో ఉపయోగపడతాయి. ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, పోలింగ్ కేంద్రం పేరు, పోలింగ్ కేంద్రం సంఖ్య, చిరునామా, ఓటరు జాబితాలోని సంఖ్య తదితర వివరాలతో పాటు సంబంధిత బీఎల్ఓ పేరు, సెల్‌ఫోన్ నంబర్, ఓటర్లకు పోలింగ్ కేంద్రాలలో కల్పిస్తున్న సదుపాయాలు, పోలింగ్ రోజున ఓటర్లు పాటించాల్సిన నిబంధనలు ఈ చిట్టీలలో ఉంటాయి. ఓటర్ల సమాచారంతో పాటు తమ పరిధిలో ఏవైనా ఎన్నికల ఉల్లంఘనలు జరిగినా, రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా పోల్‌చీటీలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి వెబ్‌సైట్, 1950 టోల్ ఫ్రీ నంబర్ కూడా ముద్రించి ఉంది. కాగా వీటిని గతంలో రాజకీయ పార్టీలే ముద్రించి పోలింగ్‌కు ముందురోజు తమ గుర్తు ఉన్న కరపత్రాలతో ఓటర్లకు పంచేవి. అవి పూర్తిస్థాయిలో ఓటర్లకు చేరక ఇబ్బందులు ఏర్పడేవి. ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు తిప్పలు పడేవారు. దీంతో ఓటర్లు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వినియోగించుకునేలా ఎన్నికల సంఘమే వీటిని ముద్రించి పంపిణీ చేస్తుంది.

మిర్యాలగూడ నియోజకవర్గంలో..

మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2 లక్షలు 35 వేల 868 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1లక్ష 15 వేల 543 మంది ఉండగా మహిళలు 1లక్ష 20వేల 299 మంది ఉన్నారు. వీరిలో 26 మంది థార్డ్ జెండర్స్ ఉన్నారు. ఈ నియోజకవర్గంలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలం, మాడుగులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం 264 పోలింగ్ కేంద్రాలున్నాయి. అయితే ప్రతి పోలింగ్ బూత్‌లో ఎక్కువశాతం పోలింగ్ అయ్యే విధంగా విధంగా చర్యలు తీసుకున్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటి ఓటరు చిట్టీల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రక్రియ మే 4వ తేది వరకు కొనసాగే అవకాశం ఉంది. బూత్ స్థాయి అధికారులపై పర్యవేక్షణకు సూపర్‌వైజర్లు ఎలక్ట్రోల్ అధికారితో పాటు నోడల్ అధికారులను నియమించారు.

సాగర్‌నియోజకవర్గంలో..

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పెద్దవూర, గుర్రంపోడు, అనుముల, త్రిపురారం, నిడమనూరు, తిరుమలగిరి సాగర్, మాడ్గులపల్లి మండలాలు ఉండగా మొత్తం 282 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,36,484 ఓటర్లు ఉన్నారు. వీనిలో 1,15,852 మంది పురుషులు, 1,20,611 మంది మహిళలు, 21 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీనిలో గుర్రంపోడు మండలంలో 38,255 ఓటర్లు, పెద్దవూరలో 47,283, తిరుమలగిరిసాగర్‌లో 34.210, అనుముల మండలంలో 36,245, నిడమనూరులో 35,820, మాడ్గులపల్లిలో 7710, త్రిపురారం మండలంలో 36,261 ఓట్లు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు సూచించినట్లు వీరందరికి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పోల్‌చీటీలు అందజేస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు మే 8వ తేదీ అయినప్పటికీ 2వ తేదీ వరకే ప్రతీ ఓటరుకు పోల్‌చీటీలు పంపిణీ చేసేలా ఆయా గ్రామాల బీఎల్ఓలు ముందుకు సాగుతున్నారు.

అందరూ ఓటు వేయాలి

ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నాము, ఇందుకు అవసరమైన పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నాం. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి వీటిని ఓటర్లకు అందజేస్తున్నారు. పెద్దవూర మండలంలో 60 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందరు బీఎల్ఓలు ఇంటికి వెళ్లి పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. పోల్‌చిట్టీల పంపిణీ గడువు ఈ నెల 8వ తేదీ వరకు ఉన్నప్పటికీ మే 2వ తేదీ నాటికే పంపిణీ పూర్తి చేస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వినియోగించుకోవాలి.

– ఎస్.సరోజ, తహసీల్దార్, పెద్దవూర

ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లిలో దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి దాని ద్వారా రైతులకు సాగునీటిని అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మండల కేంద్రంలో మహిసాసురమర్ది అమ్మవారికి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి 10 వేల మెజార్టీని తీసుకువచ్చేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, కూరాకుల మంగమ్మ, హనుమంతు, నాగేశ్వర్‌రావు, హనుమయ్య, కంచుకొమ్ముల శ్రీనివాస్, హరీష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



డిండి : కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి : తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోనబోయనపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనను చూసి రోజురోజుకు కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడి గెలుపున ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను,నక్క సత్యనారాయణ,అర్జున్, అనిల్,చంద్రమౌళి, బాలస్వామి, వెంకటయ్య, చెన్నయ్యక, యాదయ్య, నీరంజన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో చందంపేట మండలం ముదుదండ్ల గ్రామానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో నాయకులు ఏంఏ సిరాజ్‌ఖాన్, జాల నర్సింహారెడ్డి , వెంకటయ్య, సర్వయ్య, బిక్కునాయక్ పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బంగారు మైసమ్మ తల్లి అనుగ్రహంతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బంగారుగడ్డలో నిర్వహించిన బంగారు మైసమ్మ తల్లి పండుగలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు /జ్ఞాపకార్థంగా కుటుంబసభ్యులు నిర్వహించిన అన్నదానంలో ఆయన పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ కుర్ర చైతన్య, నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, చిట్టిబాబునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, నూనె రవికుమార్, దొనేటి సైదులు, చిరంజీవి, ప్రవీణ్, బాలె షహీద్, బొడ్డు సైదులు, భిక్షం, దయాకర్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని బంగారుగడ్డ 30వార్డులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుర్ర చైతన్య, అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, రవి, దయాకర్, హరీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మాదిగల మద్దతు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజి సైదులు



రఘువీర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి మాదిగల సంపూర్ణ మద్దతు ఉంటుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(తెలంగాణ స్టేట్) జిల్లా అధ్యక్షులు రామాంజి సైదులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు మాదిగ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను దుర్వినియోగం చేశాడని ధ్వజమెత్తారు. మాదిగలను విస్మరించిన కేసీఆర్‌కు ఈ పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని ప్రకటించి నేటి వరకు కూడా అమలు చేయకుండా మాదిగలను విస్మరించిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మాదిగలు సంపూర్ణ మద్దతు ప్రకటించి భారీ మెజార్టీ వచ్చే విధంగా మాదిగలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు లక్ష్మణ్, శ్రీను, కిరణ్, సురేష్, సత్యం, సైదులు, మహేష్, శోభన్‌బాబు, జీవరత్నం, శ్రీకాంత్, రాజు, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కూడా..

పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ లోక్ సభ కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని మిర్యాలగూడలో కలిసి సంపూర్ణ మద్దతును ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు టీఎన్‌రెడ్డి, కేఎస్ బీచారీ, ఎంహెచ్ అలీ, ఉమామహేష్, కె. సోమయ్య, ఎఎస్ రెడ్డి, పి. చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మిర్యాలగూడ టౌన్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



వేములపల్లి : శ్రీవిద్యానికేతన్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తడకమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్‌కి చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆనాటి మధుర స్మృతులు నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి చదువులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొమ్ము సైదులు, మల్లారెడ్డి, రాచకొండ రమేష్, జానకిరెడ్డి, ప్రభాకర్, రామస్వామి, నాగేశ్వర్‌రావు, గోపాల్, నాగిరెడ్డి, కాతోజు నర్సయ్య, యాదగిరి, లలిత, శోభ, సంధ్యారాణి, లక్ష్మి, శ్రీదేవి, నాగమణి, ఆదిలక్ష్మి, రమాదేవి, జనార్ధన్‌లతో పాల్గొన్నారు.

వేములపల్లి : మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డులోని శ్రీవిద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2000 – 2001 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు 23ఏళ్ల తరువాత ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో తమ గత స్మృతులను నెమరువేసుకొని ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, శ్రీనివాసచారి, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య, శ్రీనివాస్‌యాదవ్, జానయ్య పాల్గొన్నారు.

ఆలంపల్లి జానయ్యకు ఎమ్మెల్యే పరామర్శ

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి ఆలంపల్లి జానయ్య ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభకు వెళ్లగా అక్కడ చోటు చేసుకున్న తొక్కిసలాటలో ప్రమాదవశాత్తు కాలు విరిగింది. దీంతో ఆదివారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి త్రిపురారంలో జానయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గౌరవసలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కోఆ ప్షన్ హుస్సేన్, నర్సిరెడ్డి, వెంకట్ రెడ్డి, నాయకులు ఉన్నారు.



జానయ్యను పరామర్శిస్తున్న జైవీర్‌రెడ్డి

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా వేద పండిపండితులు శ్రీ పీసపాటి గణపతి శాస్త్రీ వేద మంత్రోత్సవాల మధ్య భూమి పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్మాణానికి పలువురు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోశయ్య, వివిధ పార్టీల నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ జాస్తీ జయశంకర్, కర్నాటి ప్రభాకర్, సాధినేని శ్రీనివాస్‌రావు, గౌరు నవీన్ దంపతులు, ఇనుగుర్తి మోహన్‌రావు, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షులు కోల సైదులు, బంటు సైదులు, బంటు వెంకటేశ్వర్లు, బంటు శ్రీనివాస్, లక్ష్మినారాయణ, మట్టయ్య, లింగంపల్లి శ్రీనివాస్, కొంక వెంకన్న, శ్రీను, శేఖర్, బిక్షం, దుర్గయ్య, సైదులు, గిరి తదితరులున్నారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

అబద్ధపు హామీలు.. మోసపు మాటలు



మాడుగులపల్లి : ప్రచారంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



వేములపల్లి : శెట్టిపాలెంలో ప్రచారం చేస్తున్న బీజేవైఎం నాయకులు

- కాంగ్రెస్ విధానాలను ఎండగట్టిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

మాడుగులపల్లి : అబద్ధపు హామీలు.. మోసపు మాటలతో ప్రజలను మోసగించడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేసింది శూన్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. కేంద్రంలో 400పైగా స్థానాలతో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా నుంచి పదవులు అనుభవించిన జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసింది శూన్యమని, ఇంకా ఏ మొహం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే చెత్తబుట్టలో వేసినట్లేనని, దేశ సంక్షేమం, సమగ్రత ప్రధాని మోదీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ పిల్లి రామరాజు, మండలాధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, ఇటికాల జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

వేములపల్లి : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీకి ఓట్లు వేసి గెలిపించి కేంద్రంలో మూడోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ఉంటేనే దేశం శాంతియుతంతగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదమాం ప్రసాద్, ఈట మహేష్, కుంచం రాము, మహేష్, శంకర్, నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలి

పాలకవీడు: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మతచాందస వాదంతో ప్రజల్లో చిచ్చు పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ గతంలో అవినీతి సామ్రాజ్యాన్ని నెలకొల్పి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మిర్యాలగూడలో సోమవారం జరగనున్న ఎన్నికల విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో ఎగిసిపడిన మంటలు



చందనపల్లి వద్ద రోడ్డుపై కమ్ముకున్న పొగ

నల్లగొండ రూరల్: నీలగిరి మున్సిపాలిటీకి చెందిన చందనపల్లి చెత్త డంపింగ్ యార్డులో శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో చందనపల్లి గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. మంటలు గాలికి లేచి తమ గ్రామంపై పడతాయేమోనని ఆందోళన చెందారు. జాతీయ రహదారి వెంట వెళ్లే వాహనదారులు సైతం భయాందోళనకు గురయ్యారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి విషయం తెలియడంతో ఫైరింజన్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చెత్త డంపింగ్ యార్డులో మంటలు ఎగిసి పడకుండా ఆర్పివేశారు. అయితే రహదారిపై కిలోమీటర్ పొడవునా 24 గంటలు పొగ, మంట, వేడిగాలి రావడంతో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. కుక్కలు రోడ్లపై తిష్ట వేసి వాహనదారులపై అకస్మాత్తుగా దాడులు చేయడంతో అదుపు తప్పి వాహనదారులు కిందపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు చెత్త డంపింగ్ యార్డు తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు వల్ల పానగల్ చెరువు నీరు కలుషితం అవుతోందన్నారు. అనారోగ్యంతో గ్రామస్తులు ఆస్పత్రి పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎన్‌బీఆర్ ఫౌండేషన్ సభ్యులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రానికి చెందిన నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన మహేశ్వరపు సోములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం స్థానిక మాజీ సర్పంచ్ కొత్త మర్రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ద్వారా అందించిన రూ.10వేల ఆర్థిక సాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ పేర్ల లింగయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె బాబ్జాన్, మాజీ ఉప సర్పంచ్ కొండలు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ తదితరులున్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొండమల్లేపల్లి : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడుతూ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలి కోరారు. గ్రామగ్రామాన మే డే ఉత్సవాల్లో పాల్గొని జెండాలను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జూలూరి వెంకటరాములు, మండల కార్యదర్శి ఆకులపల్లి వెంకటయ్య, రమావత్ సోమ్లా, అందుగుల శంకర్, వెంకటయ్య, శంకర్, హతిరాం, నందు, మంగ్తా తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఎర్రజెండాలు ఎగరాలి



మాట్లాడుతున్న సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు బషీర్

నాగార్జునసాగర్ : కార్మిక దినోత్సవం సందర్భంగా సాగర్ నియోజకవర్గంలో వాడవాడలా ఎర్రజెండాలను ఎగురవేయాలని సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె బషీర్ పిలుపునిచ్చారు. ఆదివారం నందికొండలోని పైలాన్‌కాలనీలోగల దొడ్డికొమరయ్య భవనంలో జరిగిన కార్మికసంఘాల సమావేశంలో మాట్లాడారు. నందికొండలో మే1న కార్మికులంతా ఉదయం 8గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుజ్జలకొండలు, గడ్డమీది రవిలు కోరారు. ఈ సమావేశంలో కార్మిక సంఘం సీనీయర్ నాయకులు బంగారు వెంకటేశం, బత్తుల గోవిందు, రోషయ్య, హనుమంతు, వెంకటేశ్వర్లు, కృష్ణ, చంద్రశేఖర్, అంజి, వెంకటమ్మ, సుబ్బారావు, శాంతి, ప్రేమ్, మోహన్, రాకేష్ పాల్గొన్నారు.

చర్లపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణ పరిధిలోని చర్లపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు శంకర్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆస్పత్రి అధినేత్రి సునీతకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సునీత

మిర్యాలగూడ : తమిళనాడు రాష్ట్రం హోసూరు సిటీలో ఆదివారం నిర్వహించిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ అకాడమి నిర్వహించిన కార్యక్రమంలో సమాజసేవలో భాగంగా తెలంగాణ చేనేత ఐక్యవేదిక అధికార ప్రతినిధి, బాలాజీ ఆస్పత్రి అధినేత్రి పోశం సునీతకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సునీత డాక్టరేట్ పొందడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, రావిరాల శ్రీనివాస్, జిల్లా రఘు, జడల చిరంజీవి తదితరులు ఉన్నారు.